
మయూరి వార పత్రిక కథల పోటీలో

ప్రత్యేక ప్రశంసా బహుమతి పొందిన కథ

# హారతీ ! ఓ హారతీ !



**ప్రారంభం**

"మీరు మీరు మీరు మీరంతా స్వార్థపూరిత రాక్షసులు. మీక్కావల్సింది రక్తమోడ్చి నేను సంపాదించే డబ్బు, దానికోసం మీరేం చెయ్యడానికైనా వెనుదియ్యరు. నన్నూ నా సుఖాన్ని ఆఖరికి నా బ్రతుకుని కూడా బలిచెయ్యడానికి వెనుదియ్యరు. మీ అందరికీ శతకోటి నమస్కారాలు. నన్నిలా వదిలెయ్యండి. నా బ్రతుకు నన్ను బతకనివ్వండి...!"

దుఃఖోద్వేగంతో డైలాగ్ చెప్పి బావురుమంది హారతి.

"కట్..." డైరెక్టర్ అరిచాడు, ఆమె వంక అభినందన పూర్వకంగా చూస్తూ.

షూటింగు తిలకిస్తోన్న జనమంతా భయంకర వాస్తవాన్నుంచి బయటపడ్డట్టు హాయిగా నిట్టూర్చి హారతి నట వైదుష్యం గురించి గొప్పగా చెప్పుకోసాగారు.

హారతి కుర్చీలో కూలబడిందన్న మాటే గానీ ఆ మూడ్‌లోంచి తేరుకోడానికి చాలా సేపే పట్టింది.

ఆమె చాలా సెన్సిటివ్ అని తెలిసిన యూనిట్ వాళ్ళు నిశ్శబ్దంగా పేకప్ చేసుకోసాగారు. కాని అసిస్టెంట్ డైరెక్టర్ శశిధర్ చూస్తూండలేకపోయాడు. ఆమెని సమీపించి ఆమె భుజం మీద చెయ్యివేసి అనునయంగా నొక్కాడు.

తలెత్తి చూసింది హారతి.

ఆమె కళ్ళల్లో సూర్యకిరణాలు పడి ముత్యాల్లా మెరుస్తోన్న కన్నీటిబొట్లకి చలించి పోయాడతడు.

"సిల్లీ! నటనను నటనగానే చూడాలి తప్ప వాస్తవం అనుకోకూడదు. పాత్రల్లో జీవించినట్టు కన్పించాలి తప్ప జీవించకూడదు. అప్పుడే అది ఉత్తమ నటన అవుతుంది"

నిట్టూర్చి కళ్ళు తుడుచుకుందామె.

"గుడ్" ఆనందంగా నవ్వేడతడు.

**సీన్ – 1**

సాయం సంధ్య ఎర్రని వెలుగులో గోదావరి నది ఉరుకుల్ని చూస్తూ, బ్రిడ్జి మీద నడుస్తున్నారు హారతీ శశిధర్‌లు.

హారతి వర్ధమాన తార. ఆమె నటించిన తొలి తమిళ చిత్రం హిట్ కాగా మరి మూడు తమిళ చిత్రాల్లోనూ, రెండు కన్నడ చిత్రాల్లోనూ బుక్కయ్యింది. వాటిలో రెండు అరవంవీ ఒక కన్నడదీ రిలీజై ఆమెకి ఉత్తమ నటిగా ప్రశంసలూ అవార్డులూ తెచ్చిపెట్టాయి. దాంతో నాలుగు తెలుగు సినిమాల్లో బుక్కయ్యింది. అవన్నీ షూటింగు ముగించుకునో ముగించుకుంటూనో వున్నాయి తప్ప ఇంకా రిలీజు కాలేదేమో జనం ఆమెని గుర్తించలేదు. ఇక శశి తెర వెనుక మనిషేమో అతడ్ని గుర్తించే అవకాశమే లేదు.

అందుకే ఇద్దరూ హాయిగా స్వేచ్ఛగా ఎగిరెగిరిపడుతూ విహరిస్తున్నారు. కబుర్లూ

జోకులూ చెప్పుకుంటూ నవ్వుతూ నవ్వించుకుంటున్నారు.

"అబ్బ ఎంత అందంగా వుంది..." ప్రకృతిని చూసి పులకిస్తూ అంది.

"ఇదివరకెప్పుడూ ఇటు రాలేదా?"

"వూహూ – తెలుగమ్మాయినే అయినా ఎనిమిదేళ్ళ వయస్సు నుంచీ మద్రాసులోనే పెరిగాను. ఇలాటి సుందర దృశ్యాల్నీ, కోనసీమ శోభనీ, గోదావరి ఉరకల్నీ చూస్తోంటే ఆంధ్రాలోనే వుండి పోవాలన్పిస్తుంది"

"వుండిపో అయితే"

"ఎప్పటికైనా వుండిపోతాను. ఆ సినిమాలూ ఆ షూటింగులూ ఆ లైట్లూ డైలాగులూ కేకలూ పుకార్లూ – ఓహ్ – ఆ వాతావరణమంటే నాకు ఎలర్జీ"

"అదేవిటి? సినిమాల్లో నటించడం నీకు ఎలర్జీయా?" సృష్టిలోని ఆశ్చర్యమంతా తన మొఖంలో తిష్ఠవేసుక్కూర్చోగా అన్నాడు.

"వట్టి ఎలర్జీయే కాదు అసహ్యం కూడా. మన ఫీల్డ్‌లోని వాళ్ళకి డబ్బూ కీర్తీ తప్ప ఇంకేమీ అక్కర్లేదు. అవి ఉచ్ఛదశలో ఉన్నప్పుడు అదే జీవితమూ పరమార్థమూ అనుకుంటారు. అవి కాస్తా తగ్గుముఖం పట్టేసరికి అయ్యో సగం జీవితం పరుగు పందాల్తోనే సరిపోయిందే అని విచారిస్తారు. నేను వారిలో ఒకర్ని కాదలుచుకోలేదు. నా జీవితాన్ని నా అభిప్రాయాలకీ ఆకాంక్షలకీ అనుగుణంగా తీర్చిదిద్దుకుంటాను"

నోట మాట రాక ప్రాన్పడి చూస్తూండిపోయాడు శశి. అతడికా మాటలు రుచించక పోవడమే కాదు జీర్ణించుకోడానికి చాలా టైమే పట్టింది.

"ఇంక వెళ్దామా..." ఇంత క్రితం చిందులేసిన వుత్సాహం ఇంకిపోగా అన్నాడు.

"కాస్సేపుండి వెళ్దాం"

"రేప్రొద్దున్నే షూటింగ్ స్పాట్‌కి బయల్దేరాలి కదా – ఇక వెళ్దాం"

"అందుకే ఈ ఫీల్డంటే నాకసహ్యం. మనిష్టమొచ్చినట్లుండటానికి ఒక్కనాడూ వీలుపడదు"

"ఆటోని పిలవనా?"

"వద్దులే సరదాగా నడిచెళ్దాం"

హారతి ఏదేదో చెబుతూనే వుంది. పరధ్యానంగా వింటూ నడుస్తున్నాడు శశి.

ఆమె ఆగింది. ఎందుకాగిందో అర్థంగాక ఆమె చూస్తున్న వేపు చూశాడు.

అక్కడో పెళ్ళి జరుగుతోంది. షామియానాలో రంగురంగుల బల్బులు, పచ్చని తోరణాలూ పూలతో అరటిచెట్లతో కట్టిన మంటపం, హడావిడిగా తిరిగే ఆడా మగా...

"ఏం ప్రత్యేకతుందనీ ఆగేవు?"

"సినిమా పెళ్ళిళ్లు చూసీ చేసీ చేయించీ పెళ్ళంటే మనకి ఓ తమాషాగా

అన్పిస్తూంటుంది గానీ నిజానికి పెళ్ళి ఒక మధురభావన. ప్రతివారి జీవితంలోనూ గొప్ప మార్పు తెచ్చి ధన్యత చేకూర్చే బంగారు వరం"

"అవును గాని ఇంక పద. ఎవరైనా చూస్తే బావుండదు"

"శశీ – నా గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"అంటే?"

"మనం పెళ్ళి చేసుకుంటే బావుంటుందనీ"

"హారతీ!"

"ఏం? ఇష్టంలేదా?"

"అహహ అదికాదు. నిజంగా నేను కోరుకుంటున్నదదే. ఐలవ్యూ హారతీ. కానీ మీ అమ్మా నాన్నా... ..."

"కూతురి సుఖ సంతోషాలని కోరేవారైతే వాళ్ళేం అభ్యంతరం పెట్టరు. ఐలవ్యూ సో మచ్ శశీ" అంటూనే అతడి చేతిమీద ముద్దుల వర్షం కురిపించింది.

హొటల్ రూమ్‌కెళ్తూనే తన సూట్‌కేస్ లోంచి ముద్దులు మూటగట్టే చిన్న రబ్బరు బొమ్మని బయటికి తీసింది హారతి.

ఇంకొన్ని రోజుల్లో పెళ్లవుతుంది. మరికొన్ని నెలల్లో తను బొమ్మల్లాంటి పిల్లలకి తల్లి అవుతుంది. స్త్రీకి తీయని వరమైన మాతృత్వాన్ని తనివి తీరా అనుభవిస్తుంది. చిన్నప్పుడే తనలో పడ్డ బీజం మొలకెత్తి వేళ్ళు తన్నిన మొక్క ఇంకొన్ని రోజుల్లో పుష్పిస్తుంది. ఇంకొన్ని నెలల్లో కాయకాస్తుంది!"

రబ్బరు బొమ్మని గుండెకి హత్తుకుంది – ఆనంద కడలిలో నిలువునా మునిగి తేలుతూ.

ఆ రాత్రంతా ఆ బొమ్మ ఆమె గుండెల మీదే వుంది.

## <u>సీన్ – 2</u>

బాంబు విసిరెయ్యడంతో తన పని పూర్తికాగా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చునుంది హారతి.

ఊహించని విధంగా తమ మీద బాంబు పడ్డట్టు అవాక్కైపోయి ఆశ్చర్యంతో చూస్తూండిపోయిందామె తల్లి కామాక్షమ్మ. తన చీకటి గుహలోంచోసారి తల బయటపెట్టి బాంబు వేసిన మనిషిని చూసి తిరిగి తన గుహలో కెళ్ళిపోయిన ముసలి తాబేలులా ఆమె తండ్రి శివరావుగారోసారి కూతుర్ని చూసి తిరిగి పేపర్లో మునిగిపోయారు.

"ఇంతకీ ఏవిటే నువ్వంటున్నదీ. అవీ ఇవీ అందిస్తూ డైరెక్టరెనకాల తిరిగే ఆ కుర్రాడ్ని పెళ్ళి చేసుకుంటావా?" అపనమ్మకంగానూ ఆశ్చర్యంగానూ చూస్తూ అందావిడ.

అవునన్నట్లు తలూపింది హారతి.

"నీకేమైనా మతిపోయిందేవిటే? ఇప్పుడిప్పుడే మంచిపేరు తెచ్చుకుంటూ వృద్ధిలో కొస్తున్న నువ్వు పెళ్ళి చేసుకుంటే ఇక ఇంతే సంగతులు. ఒక్క నిర్మాత కూడా మన దగ్గరికి రాడు. నువ్వింకా హిందీ సినిమాల్లో కూడా నటించి గొప్ప తారవైపోతావనీ, ఏడుతరాల వాళ్ళు కూర్చుని తిన్నా తరగనంత ఆస్తిపాస్తుల్నీ కీర్తి ప్రతిష్టల్నీ సంపాదిస్తావనీ మేం కలలు కంటోంటే, నీ వూహలు పెళ్ళి చుట్టు తిరుగుతున్నాయా? బాగానే వుంది వరస. మా దగ్గరంటే అన్నావు గానీ ఇంకెక్కడా ఇలా వాగకు. అసలే పత్రికల వాళ్ళు గోరంతలు కొండంతలు చేసి రాస్తారు"

తల్లి మాటలు పట్టించుకోకుండా అంది. "పెళ్ళి చేసుకుని సినీ ఫీల్డుకి గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాను"

"ఏవిటే ఆ పిచ్చి వాగుడూ. వేషాలెయ్యడం మానేసి ఆ పనికిరాని కుర్రకుంకని కట్టుకుని అడుక్కుతింటావా?"

"మమ్మీ!"

"నోర్మూయ్యింక. వెధవ్వేషాలెయ్యక నేను చెప్పినట్టు విను. అంతగా ఇష్టం లేకపోతే నాలుగయిదేళ్ళు పోయాక పెళ్ళి చేసుకుని, వేషాలు మానేద్దువుగానిలే. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు. ఇప్పుడే నాలుగు రాళ్ళు సంపాదించుకోవాలి గానీ తర్వాతెవరూ మన మొహం చూడరు"

కన్నీళ్ళు పొంగిరాగా బేలగా చూసిందో క్షణం హారతి. అంతలోనే ధైర్యం తెచ్చుకుని "ఏమైనా నా అభిప్రాయం మారదమ్మా" అంది.

నిర్విణ్ణురాలయింది కామాక్షమ్మ. వెర్రిగా కూతుర్ని చూసి "ఇలాటి వేషాలేస్తావనే అవుట్ డోర్ షూటింగ్సుకి ఒంటరిగా పంపించనన్నది. నేను చిన్నపిల్లనా అంటూ ఎగిరెగిరి పడ్డావు. ఇప్పుడా కుర్రాడు నీకేదో మందు పెట్టి వలలో వేసుకున్నాడు! అలా మూగవాళ్ళా కూర్చున్నారేమండీ, అమ్మాయి ఏమంటోందో విన్నారా?" అంది.

"విన్నాను. విన్నాను. పోనీ దానిష్ట ప్రకారమే కానివ్వరాదే"

"హవ్వ! లక్షలు తెచ్చే సినిమాలు కాదని కాణికి ఠికాణాలేని కుర్రాడ్ని పెళ్ళి చేసుకుని వూరేగమంటారా? బాగానే వుంది మీ బోడి సలహా. నేను చచ్చినా దీనికొప్పుకోను. హారతీ, మంకు పట్టు పట్టక నేను చెప్పినట్టు విను. కోటికి పడగలెత్తిన వాడికి నిన్నిచ్చి పెళ్ళిచేసే బాధ్యత నాది. సరేనా?"

"నాకంత అత్యాశ లేదు"

"నీకు లేకపోయినా మాకుంది గాని వెర్రి మొర్రి వేషాలెయ్యకు. ఆ అబ్బాయంటే అంతగా మోజుంటే పెళ్ళీ గిళ్ళీ అనకుండా కలిసుండండి. నాలుగేళ్ళు పోయాక రాజా

లాంటి సంబంధం తెచ్చి..."

"మమ్మీ!" అరిచింది హారతి.

అదిరిపోయి చూశారామె తల్లిదండ్రులు.

"మీరొప్పుకున్నా లేకపోయినా నా ఇష్ట ప్రకారం చేసి తీరుతాను" నీళ్ళు నిండిన కళ్ళతో తీవ్రంగా చూస్తూ అనేసి విసవిసా వెళ్ళిపోయింది తన గదిలోకి.

<u>**సీన్ – 3**</u>

మెట్లెక్కి మేడమీది కొస్తోన్న కామాక్షమ్మని చూసి గతుక్కుమన్నాడు శశిధర్. తన కంగారు కన్పించకుండా జాగ్రత్త పడుతోంటే, "సినిమా వాడివైనా పోనీలే అని మేడమీది గది అద్దెకిచ్చినందుకు మొత్తం నా యింటినే కొల్లగొడదామని చూస్తున్నావన్న మాట" అన్నదావిడ సూటిగా.

"మీరేవంటున్నారో నాకర్థంగావట్లేదు"

"వూరికే నటించకు. మా అమ్మాయిని వదిలేసి దూరంగా వెళ్ళిపోవడమో, వేరే పెళ్ళి చేసుకోవడమో చెయ్యడానికి నీకెంత డబ్బు కావాలో చెప్పు"

"సారీ... డబ్బు ప్రేమని కొనలేదని సినిమావాడ్ని నేను మళ్ళీ చెప్పాలా?"

"నీ ప్రేమ అమ్మాయి మీద కాదనీ అది సంపాదిస్తున్న డబ్బు మీదనీ నాకు బాగా తెల్సు"

"మరింకేం?"

"నీకు తెలుసో లేదో పెళ్ళయ్యాక అది సినిమాల్లో నటించదట. అదో నిర్ణయం తీసుకుంటే దాన్ని మార్చడం బ్రహ్మతరం కాదు. ఆలోచించుకో" అనేసి విజయ గర్వంతో చిన్నగా నవ్వి వెళ్ళిపోయిందావిడ.

నిరుత్తరుడయ్యాడు శశిధర్.

కొన్ని క్షణాలు తీవ్రంగా ఆలోచించేక తల పంకించాడు. సంతృప్తిగా నవ్వుకుంటూ గదిలోకెళ్ళి పడుకుని గతాన్ని నెమరు వేసుకోసాగాడు.

ఆరేళ్ళ క్రితం డిగ్రీనీ నాటకానుభవాన్నీ చేతబట్టి మద్రాసు వచ్చాడు శశిధర్. ఒక ఏడాది పాటు నానా తిప్పలూ పడి గొప్ప నటుడవ్వాలన్న కోరికకి తిలోదకాలిచ్చి అసిస్టెంటు డైరెక్టరుగా అవతారమెత్తాడు. అప్పట్నుంచీ ఎవరో ఒకరి దగ్గర అసిస్టెంటుగా చేస్తూ వేసిన చోటే వుండే గొంగళిలా వుండిపోయాడు. తనకన్నా జూనియర్లు అర్థబలం అంగబలం కాకా బలాల్తో డైరెక్టర్లై పోతోంటే తను మాత్రం మార్పులేకుండా వుండిపోయాడు.

మూడేళ్ళక్రితం కామాక్షమ్మగారి మేడమీది గది అద్దెకు తీసుకున్నాడు. తనలోకం తనదన్నట్టుండేవాడు తప్ప మిగతావేవీ పట్టించుకునేవాడు కాదు.

అప్పట్లో హారతి ఎయిత్ క్లాస్ చదివేది. సన్నగా నాజూగ్గా అందంగా చలాకీగా

నవ్వుతూ తుళ్ళుతూ వుండేది. అప్పుడప్పుడూ ఆమె కంటబడినప్పుడు తన గుండె ఝల్లుమంటుండేది తప్ప ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. ఆమె కూడా అంతే.

కామాక్షమ్మ మాత్రం తరచూ వచ్చి సినిమా వారి విశేషాలూ, నటీనటుల పారితోషికాలూ అడిగి తెలుసుకుంటుండేది.

రెండేళ్ళక్రితం కాబోలు హారతిని సినిమాల్లో జేర్పించాలనుకుంటున్నాననీ మంచి ఛాన్స్ వచ్చేలా చూడమనీ కోరింది కామాక్షమ్మ. తనంతగా పట్టించుకోలేదు మొదట. కానామె అదేపనిగా అడుగుతూండడంతో తనకీ లాభముండొచ్చనే దృష్టితో కొత్త హీరోయిన్ కోసం వెతుకుతున్న ఓ తమిళ దర్శకుడికామె ఫోటోలు చూపించి గొప్పగా చెప్పేడు.

మేకప్ టెస్ట్‌లో కూడా ఓకే అయ్యేసరికి హారతి హీరోయిన్‌గా బుక్కయ్యింది.

ఆమెకి సినీ జీవితం మీద ఆకర్షణ లేకపోయినా నటన మీద ఆసక్తి వుంది.

అందుకే తన పాత్ర గురించి క్షుణ్ణంగా తెలుసుకుంది. డైలాగులు రాసుకుంది. ఏ రోజున ఏ సీన్ చిత్రీకరిస్తారో తెలుసుకుని శశి రూమ్‌లో ప్రాక్టీసు చేసింది. మొదట అయిష్టంగానే ఒప్పుకున్నా తర్వాత్తర్వాత ఆమె ఉత్సాహం చూసి మరింత శ్రద్ధగా గైడెన్స్ ఇవ్వసాగాడు. దాంతో ఇద్దరూ మంచి స్నేహితులై పోయారు. వీలు దొరికితే చాలు గంటల కొద్దీ కబుర్లు చెప్పుకోవడం, సినిమాల కెళ్ళి ఆయా నటుల నటనని విశ్లేషించుకోడం చేసేవారు.

హారతి ఒక్క శశితో తప్ప యూనిట్‌లోని మిగతా వాళ్ళతో అంతగా కలిసేది కాదు. అది చూసి మిగతా వాళ్లంతా వాళ్లిద్దరూ మంచి స్నేహితులని చెప్పుకునే వాళ్ళు. చాటున నవ్వుకునే వాళ్లు.

మొదటి చిత్రం హిట్టవడంతో మరిన్ని ఆఫర్లొచ్చి బిజీ అయిపోయింది హారతి. అయినా ఇదివరకటి ఏకాగ్రత భగ్నం కాలేదు. తల్లి కిష్టంలేకపోయినా శశితో తిరగటం, అతడి సూచనలని స్వీకరించడం మానలేదు.

క్రమంగా వారి స్నేహం ప్రేమగా రూపుదిద్దుకోసాగింది. ఆమె దృష్టిలో అతడు గురువు స్నేహితుడు ప్రియుడు. అతడి దృష్టిలో ఆమె ప్రేయసి, భాగ్యదేవత.

తను దర్శకుడయ్యేరోజు కనుచూపుమేరలో కన్పించడం లేదు గనుక హారతి ద్వారా దర్శకుడే కాదు దర్శక నిర్మాత కూడా కావాలని అతడి ఊహ-ఆలోచన-పథకం. అందుకే ఆమెని వివాహం చేసుకోడానిగ్గాను రంగమంతా సిద్ధం చేసేశాడు.

ఫ్లాష్ కరిగిపోయేసరికి శశి డిస్కోసాంగ్ హమ్ చేస్తూ డాన్సేస్తున్నాడు.

**<u>సీన్ - 4</u>**

ఒక చిన్న దేవాలయంలో అత్యంత నిరాడంబరంగా వివాహం చేసుకున్న హారతీ శశిధర్‌లు హొటల్లో అరేంజ్ చేసిన విందుకి సినీ ప్రముఖులూ, నటీనటులూ, జర్నలిస్టులూ,

బంధుమిత్రులూ చాలామంది వచ్చారు.

పెళ్ళి ఇష్టం లేకపోయినా మరి గత్యంతరం లేక కామాక్షమ్మా శివరావుగారు కూడా విందు కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యడానికి కృషి చేస్తున్నారు.

రిసెప్షన్, విందు ముగిశాక జర్నలిస్టులు హారతిని చుట్టుముట్టారు.

వారి స్నేహం గురించీ, తొలి పరిచయాల గురించీ, పెళ్ళికి దారితీసిన పరిస్థితుల గురించీ అడిగిన ప్రశ్నలకి క్లుప్తంగా జవాబిచ్చింది హారతి.

అంతలో ఓ జర్నలిస్టు "మీరు సినిమాల్లో నటిస్తారా లేక మానేస్తారా?" అని ప్రశ్నించాడు.

"వివాహ మయ్యేక సినిమాల్లో నటించకూడదన్నది నా అభిప్రాయం" అన్నదో లేదో ప్రక్కనే ఉన్న శశి "కాదు" అన్నాడు.

హారతితో సహా అంతా ఉలిక్కిపడి చూశారతని వంక.

చిన్నగా నవ్వుతూ "సినిమాల్లో నటించకూడదన్నది ఆమె అభిప్రాయం కాదు. ఆ విషయమై ఒక నిర్ణయానికి రాలేదు కూడా. ప్రస్తుతం ఆమె నటిస్తోన్న చిత్రాలు పూర్తయ్యేక ఆ విషయం గురించాలోచిస్తాం" అన్నాడతను.

శశి తన చేతిని నొక్కడంతో అతడి భావం అర్థమై మరక్కడ తర్కించలేదు హారతి.

"శశీ! పత్రికల వాళ్ళతో అలా చెప్పావేం?" ఆ రాత్రి అడిగిందామె. "సినిమా ప్రపంచం నాకిష్టం లేదనీ ఒక చక్కని గృహిణి కావాలన్నది నా అభిలాషని నీకు తెలుసు కదా" అని కూడా అంది.

"నిజమే. కాని ఫీల్డ్ మంచిది కానంత మాత్రాన కళకి దూరమవ్వడం సమంజసమా చెప్పు? కళ దైవదత్త మంటారు. కళల్లో కెల్ల ఉత్కృష్టమైన నటనలో అతి స్వల్ప కాలంలో ఉన్నత శిఖరాల నధిరోహించి పండిత పామరులిద్దరి ప్రశంసలూ పొందావు. అటువంటప్పుడు సినిమాలకి దూరమై కళకు ద్రోహం చేస్తానంటే నేనెలా ఒప్పుకోను చెప్పు? అలా అని నీ అభిలాషల్నీ అభిరుచుల్నీ తక్కువ చెయ్యను. అంచేత వచ్చిన ఆఫర్లన్నీ ఒప్పుకోక చక్కని చిత్రాల్లోనే నటించు – తక్కువ సినిమాల్లోనే నటించు. అటు కళాకారిణిగా ఇటు గృహిణిగా తృప్తిగా జీవించు. ఇక ఫీల్డులోని చెడు అంటావా అదెక్కడైనా ఉండేదే. కాదంటే ఇక్కడి సంగతి మనకి బాగా తెలుసు గనుక ఇక్కడే ఎక్కువగా ఉన్నట్టు మనకన్పిస్తూంటుంది. బురదలో పుట్టినా బురద అంటని పద్మం లాంటి నువ్వు వాటి గురించి భయపడాల్సిన పని లేదు. కళాసేవ చెయ్యనంటే నీ ముఖ్య అభిమానుడ్నైన నేనే కాదు లక్షలాది నీ అభిమానులూ విలవిల్లాడతారు. అంచేత ఇంకోసారి ఆలోచించి చూడు హారతీ"

ఇంకేం ఆలోచిస్తుంది?

అతడి మాటలు తీయని అమృతపు సోనలు! మనస్సుని జోకొట్టే మత్తు గుళికలు! రంగు రంగుల సిల్కు దారాల ఉచ్చులు!

"నీ మాట శిరసా వహిస్తాను శశీ"

"థాంక్యూ డియర్" ఆమెని గుండెలకి హత్తుకుంటూ గుండెల్లో నవ్వుకుంటూ అన్నాడు.

<u>**సీన్ – 5**</u>

కొన్ని రోజుల క్రితం వరకూ ఆనందం హడావిడీ ఆర్భాటం ప్రతిధ్వనించిన కామాక్షమ్మగారిల్లు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉంది. నిట్టూరుస్తున్నట్టుగా ఉంది.

ఆ నీరవ నిశ్శబ్దాన్ని భరించలేక భోరున ఏడ్వాలనుందామెకి.

పెళ్లైన వెంటనే హారతి తన నగలూ తన పేరనున్న డబ్బూ తీసుకుని భర్తతో బాటు వేరే ఇంటి కెళ్ళిపోయింది.

పెళ్ళి చేసుకున్నా ఆమె తనింట్లోనే ఉంటుంది గనుక ఆమె డబ్బు తన డబ్బే అవుతుందనీ, ఇదివరక్కన్నా జాగ్రత్తపడి దాచుకోవచ్చనీ ఆశించిన కామాక్షమ్మకి తీవ్ర ఆశాభంగం కలిగింది. తన కలలన్నీ పేక మేడల్లా కూలిపోగా నిస్సహాయురాల్లా ఉండిపోయింది. అలా అని అలాగే ఉండాలని లేదు. ఎలావోలా హారతి మీద మళ్ళీ మునుపటి అజమాయిషీ సంపాదించాలన్నదామె తపన, ఆరాటం.

అలా జరగన్నాడు తనో రైల్వే ఉద్యోగి భార్యగానే ఉండిపోతుంది తప్ప సంఘంలో ఒక హోదా, ఒక గౌరవం, ఒక మన్నన పొందలేదు. స్కూళ్ళలో చదువుతోన్న తన నలుగురి పిల్లలకీ చక్కని భవిష్యత్తు నివ్వలేదు.

అందుకే తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చి ఫోన్ దగ్గరకి నడిచింది.

"హారతీ"

"నేనే మమ్మీ. డాడీ, తమ్ముళ్ళు బావున్నారా?"

"బాగానే ఉన్నారు గానీ ఇవాళ షూటింగు లేదా?"

"ఉంది. ఇంతక్రితమే వచ్చాను"

"అల్లుడు గారు లేరా?"

"ఇంకా రాలేదు"

"నీతో ఓ ముఖ్యమైన పనుందమ్మా. ఒక సారొస్తావా?"

"ఇప్పుడా? టైరయ్యానమ్మా – నువ్వు రాకూడదూ?"

"సరే వస్తున్నా" తప్పదు గనుక రిసీవర్ పెట్టేసి బయల్దేరింది టాక్సీలో.

సాదరంగా ఆహ్వానించింది హారతి.

"కొత్త కాపురం ఎలా ఉందే"

చిన్నగా నవ్వి "చూస్తున్నావుగా" అంది.

"అవునూ సినిమాల్లో నటించనన్నావు. ఇప్పుడు మళ్ళీ చాలా చిత్రాల్లో బుక్కయ్యావుటకదా"

"అవునమ్మా. కళాసేవ చెయ్యగల అదృష్టం అందరికీ లభించదు. లభించిన వాళ్ళు కళకి దూరమైతే కళకి ద్రోహం చేసినట్టే అన్నారాయన. అందుకే మంచి పాత్రలు గల సినిమాల్లోనే నటిస్తున్నాను"

మొఖం ఎర్రగా చేసుకుందావిడ. అల్లుడు అమ్మాయిని బుట్టలో వేసుకున్నాడన్న నిజం ఆమెని ముళ్ళ కుర్చీలో కూర్చోబెట్టింది.

"నేను ముందే చెప్పేను కదమ్మా. విన్పించుకున్నావు కాదు. అందుకే అన్నారు శంఖంలో పోస్తేనే గాని తీర్థం కాదని. ఈ కాలపు పిల్లలు కట్టుకున్న వాడి మాటకి విలువిస్తారు గానీ కన్న తల్లి మాట విన్పించుకుంటారా! మీరూ తల్లులయ్యాక తెలిసొస్తుంది కడుపు కోత ఎటువంటిదో"

"అహ అదికాదు మమ్మీ. నువ్వంటే నా కెప్పుడూ ప్రేమే. మరేమో అప్పుడు..."

"జరిగింది తవ్వుకోవడం ఎందుకులే గాని జరగాల్సిందాలోచిస్తే మంచిది"

ఏవిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది.

"ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మలేకుండా ఉన్నామమ్మా. డబ్బు విషయంలో ఇక చెప్పనే అక్కర్లేదు. అంచేత ఎవరి జాగ్రత్తలో వాళ్ళుండాలి"

"అందరూ వేరు ఆయన వేరూనూ. ఆయన గురించి భయపడక్కర్లేదు మమ్మీ"

"ఇప్పుడు ఈ వేడిలో అలాగే అన్పిస్తుందమ్మా. రోజూ మనం ఎన్ని సినిమా వాళ్ళ పెళ్ళిళ్ళూ విడాకులూ చూట్టం లేదు చెప్పు? రేపు తేడా వొచ్చేక బయటపడతాయి అసలు రూపాలు. తెలివున్న వాళ్ళు ముందే జాగ్రత్త పడాలంటాను డబ్బు విషయంలో"

"అంటే నన్నేం చెయ్యమంటావు మమ్మీ"

"అలా అడుగు చెబుతాను. నిర్మాతలిచ్చే నల్ల డబ్బులో కొంత నా చేతికిస్తే అవీ ఇవీ కొని దాస్తానమ్మా. అలా చేస్తే టాక్స్ వాళ్ళ నుంచి కూడా తప్పించుకోవచ్చు. మళ్ళీ నీ సొమ్ము నీకు జాగ్రత్తగా అప్పజెప్పే పూచీ నాది" వాత్సల్యం ఉట్టి పడుతోంటే అంది.

విషప్పురుగుని చూసినట్టు చూసింది హారతి.

ఆమె తడబడింది.

"ఆయన్ని మోసంచేసి దాచుకో మంటున్నావా మమ్మీ? జీవితాన్నే ఆయన కల్పించినదాన్ని. జీవితం కన్నా డబ్బెక్కువా చెప్పు? అయన్లేనప్పుడు ఆ డబ్బునేం చేసుకోను

చెప్పు? ఇవి ఒక తల్లి ఒక కూతురికి చెప్పాల్సిన మాటలు కావమ్మా" నీళ్ళు నిండిన కళ్ళతో అంది.

"అది కాదు హారతీ. మరేమో ..."

"ఇంకేం చెప్పొద్దమ్మా. మీ నిజస్వరూపం నాకిప్పుడు తెలుస్తోంది. నువ్వు నన్నెందుకు పెళ్ళిచేసుకో వద్దన్నావో ఇప్పుడర్థమవుతోంది. మీక్కావల్సింది డబ్బు. దానికోసం కూతురి బతుకు నాశనం చెయ్యడానికీ, కూతురి సంసారం విచ్ఛిన్నం చెయ్యడానికీ కూడా మీరు సిద్ధమే. చాలా సంతోషం మమ్మీ చాలా సంతోషం!"

"అవేం మాటలే. పెళ్ళై పోయింది కదాని నవమోసాలు మోసి కన్న తల్లిని గడ్డి పరకలా తీసి పారేస్తావా?"

"అవును మమ్మీ. నువ్వు తల్లివే. అందుకే ప్రపంచంలోని ఏ తల్లీ ప్రవర్తించనట్టు ప్రవర్తించావు. నేనూ ఏ కూతురూ ఏ తల్లితోనూ అనని మాట అంటున్నానమ్మా. దయచేసి వెళ్ళిపో. మళ్ళీ ఎప్పుడూ ఇటుకేసి రాకు. నీ ముఖం నాకు చూపించకు"

మరోమాట కవకాశమివ్వకుండా గదిలో కెళ్ళిపోయి తలుపేసేసుకుంది హారతి.

**<u>సీన్ – 6</u>**

హారతికి ఫిల్మ్‌ఫేర్ బెస్టు యాక్ట్రెస్ అవార్డు వచ్చింది. జాతీయ అవార్డుల కున్నంత ప్రాముఖ్యత ఆ అవార్డుకుండటంతో నలువైపుల్నుంచీ ప్రశంసలు, అభినందనలూ వర్షంలా కురిశాయ్.

ఆమె ఆనందానికవధుల్లేక పోయాయ్. శశి ప్రోత్సాహం లేకపోతే తనింత గొప్పగా నటించేది కాదు. ఇవాళింతటి మహదానందాన్ని జుర్రుకునేది కాదనుకునేసరికి అతడి మీద మరింత అభిమానం పొంగి పొరలింది.

"డార్లింగ్" అంటూ హడావిడిగా వచ్చాడు శశిధర్.

"ఆనందాశ్వం ఎక్కి వచ్చినట్టున్నావేం శశీ" నవ్వుతూ అడిగిందామె.

"నిజంగానే ఎక్కి వచ్చాను హారతీ. ప్రఖ్యాత నిర్మాత పార్వతీశంగారు నీకు సన్మానం చెయ్యబోతున్నారు. పరిశ్రమలోని హేమా హేమీలందర్నీ ఇన్వైట్ చేస్తార్ట. సన్మానం నభూతో నభవిష్యతిగా జరిపిస్తానంటున్నారు"

"నటనలో తప్పటడుగుల దశలో ఉన్నదాన్ని. నాకిప్పుడు సన్మానం ఎందుకు శశీ"

"ఏ కళా కారుడికైనా గుర్తింపూ, తృప్తీ లభించేది ఇలాంటి కార్యక్రమాల వల్లనే. మరింత పట్టుదలా కృషీ దీక్షా కలిగేది ఇలాంటి బహుమతుల వల్లనే. కాదనకు హారతీ ప్లీజ్ ..."

"నీ ఇష్టం"

"దట్స్ గుడ్. అన్నట్టు పార్వతీశంగారు నిర్మిస్తోన్న హిందీ చిత్రంలో నిన్ను బుక్ చేసుకుంటామని అడిగారు. కాదన్లేకపోయాను" –

భర్త వంక సాభిప్రాయంగా చూసి మౌనంగా వుండిపోయింది.

మంచి పాత్రల్లో కొన్ని సినిమాల్లోనే నటించాలని ముందనుకున్నా శశి తన స్నేహితులనీ, తెలిసున్న వాళ్ళనీ, అదనీ ఇదనీ చెప్పి మరిన్ని చిత్రాల్లో నటించక తప్పనిసరి పరిస్థితి కల్పిస్తూండటంతో కాదన్లేక నటిస్తూనే ఉంది. ఏ బిజీ జీవితానికి దూరంగా వుండాలనుకుందో ఆ బిజీ సుడిగుండంలో చిక్కుకుని కాలంతోబాటు పోటీ పడుతూనే వుంది.

ఉదయమే లేవటం – ఏదో కాస్త తినటం – స్టూడియో కెళ్ళడం – మేకప్పు చేయించుకోవడం – షూటింగులో పాల్గొనటం – రాత్రి ఎప్పుడో తిరిగి రావడం – రెండు మెతుకులు కొరకటం – అలసి నిద్రపోవటం – రెండు కునుకులు తియ్యకుండానే లేవటం... అంతా పరుగు – రొటీన్ అనుభూతి రహిత నిస్సార జీవితం ...!

ఇంతేనా తనక్కావల్సింది?

ఇదేనా తను కోరుకున్నది?

ఆమె కళ్ళల్లో కన్నీటి పొర కదిలింది.

"నీ కిష్టం లేదా డార్లింగ్? పార్వతీశంగారు పెద్ద నిర్మాత గనుక పైగా నీకు సన్మానం తలపెట్టారు గనుక కాదన్లేకపోయాను. ఇందులో కొంచెం నా స్వార్థం కూడా వుందనుకో. నువ్వో ప్రాంతానికో రాష్ట్రానికో సంబంధించిన కళాకారిణిగా వుండిపోకూడదనీ, దేశం గర్వించదగ్గ గొప్ప నటివి కావాలని నా కోరిక. ఆశ. దానికేంలే – నీకిష్టం లేకపోతే ఆయనకెలావోలా నచ్చచెబుతాను. నీకిష్టం లేని పని నీ చేత నేనెప్పుడూ చేయించను హారతీ. ఇది నా ప్రామిస్"

ఆ మాటలకి వెన్నలా కరిగిపోయిందామె. "ఓకే శశీ. నాకన్నా ఎక్కువ తెలిసిన వాడివి. ఎలా బావుంటుందంటే అలా చెయ్యి"

"థాంక్యూ డార్లింగ్ థాంక్యూ సోమచ్. అన్నట్టింకో గుడ్‌న్యూస్ చెప్పనా?"

"ఏవిటి శశీ?"

"నేను డైరెక్టర్ని కాబోతున్నాను" ఎవరెస్ట్ ఎక్కిన వాళ్ళా అన్నాడతను.

"నిజంగా? కంగ్రాట్యులేషన్స్!"

"థాంక్యూ. ఓ హిట్ తమిళ చిత్రాన్ని ఓ క్రొత్త సంస్థ వాళ్లు తెలుగులో నిర్మిస్తూ నన్ను దర్శకుడిగా పెట్టుకున్నారు. అఫ్‌కోర్స్ హీరోయిన్‌వి నువ్వేననుకో"

"నాకు చాలా సంతోషంగా వుంది శశీ. ఇన్నాళ్ళకి నీ ప్రతిభకి గుర్తింపు లభించబోతోంది. నువ్వో గొప్ప దర్శకుడు కావడం తథ్యం" భర్త విజయం తన విజయంగా

భావించే ఆ భారత స్త్రీ హృదయం పున్నమినాటి సంద్రమే అయ్యింది.

<u>**సీన్ – 7**</u>

"కంగ్రాట్యులేషన్స్ మిస్సెస్ హారతీ. మీ అనుమానం నిజమే" డాక్టర్ సుజాత అంది చిర్నవ్వులు చిందిస్తూ.

"అంటే ...?"

"మీరు తల్లి కాబోతున్నారు"

"నిజంగానా డాక్టర్?" అతిశయించిన ఆనందంతో అడిగింది హారతి.

"కన్ఫర్మ్" చిన్నగా నవ్వింది.

"థాంక్యూ డాక్టర్" గబగబా హేండ్‌బేగ్ లోంచి చెక్కు బుక్కు తీసి ఓ చెక్కు రాసిచ్చి బయటికి నడిచింది గాలిలో తేలిపోతూ.

ఎన్నేళ్ళకి తన స్వప్నం ఫలించబోతోంది!

ఎన్నాళ్ళకెన్నాళ్ళకి తన ఇల్లు స్వర్గం కాబోతోంది!

ఆమె గుండెలు ఆనందోద్వేగంతో ఉక్కిరి బిక్కిరవుతున్నాయి.

ఎలా డ్రైవ్ చేసుకెళ్ళిందో తెలీకుండానే ఇంటికెళ్ళింది.

తన ఆల్మైరాలో అపురూపంగా దాచుకున్న చిన్న బొమ్మని బయటికి తీసి ప్రేమగా తల నిమిరింది. ముద్దుల్తో ముంచెత్తి గుండెలకి హత్తుకొని మైమరచిపోయి మరో లోకంలో విహరించసాగింది.

ఆమె పెదాలపై వెన్నెల్లాంటి నవ్వు సన్నగా నర్తిస్తోంది.

ఎప్పటికో ఇహానికొచ్చింది. శశికీ శుభవార్త చెప్పాలని, అతడి మొహంలో చిందులేసే ఆనంద రేఖ చూడాలని ఆరాటపడింది.

అంతలో గుర్తొచ్చింది అతడు సిటీలో లేడనీ, వైజాగ్ అవుడ్డోర్ షూటింగ్ కెళ్ళాడనీను.

లైట్నింగ్ కాల్ బుక్ చేసింది.

లైన్స్ అవుటాఫ్ ఆర్డర్ అని తెలిసి కించిత్తు నిరాశ పడింది. మళ్ళీ వెంటనే కూడ దీసుకొని తల్లికీ తండ్రికీ స్నేహితులకీ అందరికీ ఫోన్స్ చేసి మరీ చెప్పింది వెర్రి సంతోషంతో.

స్టూడియో నుంచి ఫోన్ వచ్చింది.

షూటింగు కెళ్ళడం ఇష్టం లేకపోయినా తన వల్ల నిర్మాత ఇబ్బంది పడకూడదని బయల్దేరింది.

అంతా చిరునగవుతో విష్ చేశారు. కొందరు శుభాకాంక్షలు చెప్పారు. గుండెల్లో గుబులుగా వున్నా నిర్మాత కూడా అభినందిస్తున్నట్టు మొఖం పెట్టాడు.

షూటింగులో పాల్గొనాలంటే ఏవిటో సిగ్గుగా వుంది హారతికి. తనలో ఎంతో మార్పు వచ్చేసినట్టు అనుభూతి కలుగుతోంటే అతి కష్టం మీద తన ఫీలింగ్స్ నణచుకుని నటించింది.

**<u>సీన్ - 8</u>**

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్లోంచి యూనిట్‌లోని ముఖ్యుల్తో బాటు దిగిన శశిధర్ ఫ్లాట్‌ఫాం మీద హారతిని చూసి ఆశ్చర్యబోయాడు.

"ఏం హారతీ"

"ఏం లేదు - రండి"

మిగతావాళ్ళ ప్రశ్నార్థకపు మొఖాలని పట్టించుకోకుండా ఇద్దరూ కార్లో బయల్దేరారు.

"ఏమైనా అర్జంటు పనుందా?"

హారతి తల అడ్డంగా వూపింది.

"మరి..."

నవ్వి అతడి భుజం మీద తల ఆన్చి వూరుకుంది తప్ప జవాబివ్వలేదు. క్రితం రోజు నుంచీ వుక్కిరి బిక్కిరి చేస్తోన్న శుభవార్తని అతడికి చెప్పి ఆనందానుభూతిని అతడితో పంచుకోవడం ఎలాగా అని సతమతమవుతోందామె.

బుక్‌షాపు కన్పించడంతో గబుక్కున కారాపించింది షాపుముందు.

"ఇప్పుడెందుకు?"

"ఒక్క నిమిషం..."

"బాగా టైరై వున్నాను. సాయంత్రం రావొచ్చు కదా"

"వూహూ-ఇప్పుడే-రండి చెబుతా"

అయిష్టంగానే అనుసరించాడు.

గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించిన పుస్తకమూ, పిల్లల సంరక్షణ గురించిన పుస్తకమూ కొన్నది హారతి.

శశి నుదురు ముడిపడింది. తిరిగొచ్చి కారులో కూర్చునే వరకూ మాట్లాడలేదు. అతఌ్లో ఏదో అనుమానం సుళ్ళు తిరగసాగింది.

"ఇవెందుకు?"

సిగ్గుతో ఆమె ముఖం అవనతమయ్యింది గాని జవాబివ్వలేదు. కొన్ని క్షణాలకి మెల్లగా తలెత్తి శశి వంక చూసిన ఆమె నిశ్చేష్టయయ్యింది.

తనూహించిన భావాలు మచ్చుకి కూడా లేవతడి ముఖంలో. ఏదో సీరియస్‌గా పుట్టి మునిగిపోతున్నట్లు ఆలోచిస్తున్నాడతడు.

"శశీ?" గాభరాగా కించిత్తు భయంగా అంది.

"ఈ పుస్తకాల అవసరం వచ్చిందా ఇప్పుడు?"

తలూపింది సందేహిస్తూనే.

తలపంకించి వూరుకున్నాడు తప్ప మాట్లాడలేదు.

అతడి మౌనం భరించరానిదిగా వుందామెకు

"అలాగున్నావేం?" జవాబు లేదు.

కారు పోర్టికోలో ఆగగానే దిగి గబగబా లోపలికెళ్ళిపోయాడు.

ఆమె మెల్లగా మేడమెట్లెక్కి వచ్చేసరికి ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు శశి. అతడి ముఖం కళాహీనంగా వుంది. పెదాల మీద తెచ్చి పెట్టుకున్న నవ్వు!

రిసీవర్ పెట్టేస్తూ "ఫీల్డ్‌లోని అందరికీ తెలిసిపోయిందా న్యూస్?" అనడిగాడు.

తలొంచుకుంది.

"మైగాడ్! ఎంత ఘోరం జరిగిందీ" తల పట్టుకుని కూలబడిపోయాడు.

"ఏమయ్యింది శశీ" ఆందోళనా మనస్కురాలై అడిగింది.

అతడు మాట్లాడలేదు. అతడి మౌనం ఆమెని భయపెట్టింది.

"శశీ?"

"ఊ– పిల్లలకోసం మనమిప్పుడు తొందర పడాల్సిన అవసరమేమిటి? మనమేమీ ముసలి వాళ్ళం కాలేదు గదా, ఇంక పిల్లలు పుట్టరనుకోడానికి"

అప్రయత్నంగా ఒక్కడగు వెనక్కి వేసింది హారతి భీతహరిణిలా చూస్తూ.

"ఫీల్డ్ సంగతి చూస్తున్నావుగా. పెళ్లయితే సగం బుకింగ్స్ తగ్గిపోతాయి. పిల్లలు పుడితే పూర్తిగా పోతాయి"

"అదా నీ భయం. పోతే పోనీ–నన్ను కావాలనుకునే వాళ్ళ చిత్రాల్లోనే నటిస్తాను. లేకపోతే మానేస్తాను. వాటి గురించి బంగారు వరం వద్దనెలా అనుకోగలం చెప్పు? పైగా నువ్వు డైరెక్టర్‌వి అయ్యావు. నేను పిల్లల సంరక్షణ చూడాలి. గనుక ఫీల్డ్‌కి గుడ్‌బై చెప్పడమే మంచిది"

"నీకెలా చెప్పాలో తెలీటం లేదు హారతీ. నా మొదటి చిత్రాన్నింకా జనం మీదికి వదల్లేదు. నేను దర్శకుడిగా నిలబడగలనో లేదో ఇప్పుడు ఊహించటం సాధ్యం కాదు. మొత్తం సౌత్‌కే నెంబర్ వన్ హీరోయినయ్యే అవకాశాలున్న నువ్వు ఇప్పుడు ఫీల్డ్‌కి గుడ్‌బై చెప్పడమంటే ఎండమావుల్ని నమ్ముకొని నీటి చెలమల్ని వదిలేసుకోవడమే. ప్లీజ్ హారతీ నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇంకో నాలుగయిదేళ్ళయినా నువ్విలా బిజీగా నటిస్తే మన పిల్లలూ వాళ్ళ పిల్లలు కూడా కూర్చుని తిన్నా తరగనంత ఆస్తిపాస్తులు సంపాదించుకోవచ్చు. నేనూ దర్శక నిర్మాతగా మారి మన అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చు. అంచేత..." ఆగాడతడు.

అనుమానంగా చూసింది. అతడి మాటలు వింటోంటే తల్లి ఒకనాడన్న మాటలు గుర్తు కొస్తున్నాయామెకి. ఇద్దరి యావా డబ్బు గురించేనా?

"నన్నపార్థం చేసుకోకు హారతీ. ఫారన్ రిటన్డ్ డాక్టర్‌ని సంప్రదిద్దాం. ఎవ్వరికీ తెలియకుండా గప్‌చిప్‌గా ఏర్పాట్లు చేస్తాను..."

"శశీ!" అరిచిందామె.

"ఫీల్డ్ గురించాలోచించకు. ఊహించని ఘోరం జరిగిందని నచ్చచెప్పే పూచీ నాది"

"నో నో – ఇంకేం చెప్పొద్దు నేనేం విన్లేను. అంత ఘోరానికి తలపడటం నా తరం కాదు. ప్లీజ్ శశీ – ఈసారికి అడ్డు చెప్పకు. ఈ క్షణం కోసం ఈ అనుభూతి కోసం చకోరిలా ఎదురు చూస్తున్నాను. నా కళ్ళల్లో నిప్పులు పొయ్యకు. నా కలల్ని కాలరాయకు – నీకు దణ్ణం పెడతాను శశీ. నువ్వు చెప్పినట్లల్లా వింటాను. రాత్రీ పగలూ నటించి నీకు డబ్బు మూటలు సంపాదించి పెడతాను. కానీ కానీ..." వెక్కెక్కి ఏడుస్తూ పిచ్చిదాన్లా అతడి కాళ్ళని చుట్టేసి బావురుమంది.

"ఇంత చిన్న విషయానికింత ఇదైపోవడం ఏం బావోలేదు హారతీ. సిల్లీ సెంటిమెంట్స్ కోసం బంగారు కలశాన్ని తన్నెయ్యడం బుద్ధిమంతుల లక్షణం కాదు" అనేసి వెళ్ళిపోయాడు–ఒంటరిగా వదిలితే తనకు తనే సర్దిచెప్పుకుని దారిలోకొస్తుందని.

"శశీ! శశీ!"

గుండెలు వేయి వ్రక్కలు కాగా కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి అలసి సొలసింది. అంతలో ఏదో గుర్తు రాగా గబుక్కునెళ్ళి అల్మీరా తెరచి తన చిన్నారి పొన్నారి బొమ్మని చేతుల్లోకి తీసుకుని ముద్దుల్తో ముంచెత్తింది. గుండెలకి గాఢంగా హత్తుకుని విలపించింది. కొన్ని గంటల క్రితం కొన్న పుస్తకాలనీ వాటిలోని పసిపిల్లల్నీ చూసి రోధించి రోధించి సొమ్మసిల్లి పడిపోయింది, వాటిని సందిట్లో వుంచుకునే.

మెలకువ వచ్చి చూసేసరికి సందిట్లో బొమ్మలేదు. పుస్తకాలు లేవు. తప్పిపోయిన చంటి పిల్లవాడికోసం ఆరాటపడే తల్లిలా అలమటిస్తూ వెదికింది. గది మధ్యలో బూడిద కుప్ప కన్పించింది.

గబుక్కునెళ్ళి చూసింది బూడిదని చేతుల్లోకి తీసుకుంది.

అది తను చిన్నప్పట్నుంచీ ప్రాణప్రదంగా చూసుకొంటోన్న బొమ్మ, అపురూప అనుభూతితో కొన్న పుస్తకాల తాలూకు బూడిదని గ్రహించేసరికి, అది తన స్వప్నాల స్వర్గాల తాలూకు బూడిదని తెలిసేసరికి, అదొక డబ్బు మనిషి తన తీయని అనుభూతుల్ని కాల్చి చేసిన బూడిదని అర్థమయ్యేసరికి –

హారతికి స్పృహ తప్పింది.

కిటికీలోంచి అంతా గమనిస్తోన్న శశిధర్ సన్నగా నవ్వుకున్నాడు తప్ప వెంటనే ఆమె దగ్గరికెళ్ళలేదు.

<u>ముగింపు</u>

సెట్లోకెళ్ళి కూర్చుంది హారతి. అంతా ఆమెను సానుభూతిగా చూశారు. కొందరు నిట్టూర్చారు కూడా. కానామె అదేమీ పట్టించుకోలేదు. తనకీలోకంతో సంబంధం లేనట్లుగా వుంది.

ఆమెలో ఇదివరకటి కళలేదు. ఉత్సాహం లేదు. ఆసక్తి లేదు. ఏదో యాంత్రికంగా నటిస్తోందంతే. మనిషి కూడా కళాకాంతులు కోల్పోయి మనోవ్యాధి పీడితురాల్లా వుంది. అందుకే ప్రేక్షకులు మునుపట్లా ఆమెనీ ఆమె నటననీ అభిమానించలేకపోతున్నారు. ఫలితంగా బుకింగ్స్ తగ్గిపోయాయి. ఊహించని పరిణామం ఎదురయ్యేసరికి శశిధర్ రాక్షసుడిగా మారిపోయి అనుక్షణం నరకం చవిచూపించసాగాడు. ఫలితంగా జీవితం మీద ఏ మూలో మిగిలివున్న ఆశ కూడా పూర్తిగా వాడి రాలిపోయింది.

డైరెక్టర్ వచ్చి డైలాగ్ చెప్పి సన్నివేశం వివరించాడు. రెండుసార్లు మననం చేసుకుంది. డైరెక్టర్ "స్టార్ట్" అన్నాడు.

"హుఁ ఈ బతుకు పయనం ఇంకా ఎన్నాళ్ళో తెలీదు. కాని బతుకు మీదా ఆశమీదా అన్ని ఆశలూ పోయాయి. కన్ను పొడుచుకున్నా కన్పించనంత కారు చీకటి నా జీవితాన్ని చుట్టేసింది. ఎందుకు బతుకుతున్నానో తెలీదు. ఇది బతుకో కాదో కూడా తెలీదు. అందుకే బతికేస్తున్నాను జీ-వ-శ్చ-వం-లా!"

డైలాగ్ చెబుతూ దభీమని పడిపోయింది హారతి.

ఆమె నటనకి కళ్ళు చెమ్మగిల్లగా "కట్" అన్నాడు దర్శకుడు.

కానామె లేవలేదు.

ముఖాముఖాలు చూసుకుని ఆమెని సమీపించేసరికి ఆమెలోని చిలుక ఎగిరిపోయింది సుదూర తీరాలకు!

*　　*　　*

**(మయూరి సచిత్ర వార పత్రిక 14-02-1986)**